INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN : 2277-7881; IMPACT FACTOR – 4.527; IC VALUE:5.16; ISI VALUE:2.286
VOLUME 6, ISSUE 5(7), MAY 2017

# MO-OKA PARISEELANA ("మో" ఒక పరిశీలన)

**Dr. G. Jhansi Vani.**
HOD,
Department of Telugu.
Bapatla Arts & Science College,
Bapatla,Guntur District - 522101

నేను అసాధారణ కవిని అని 'వేగుంట మోహన ప్రసాద్' తన గురించి తానే చెప్పుకున్నాడు. నిజంగా ఆయన ఒక అసాధారణ, అసామాన్య, అపూర్వ కవి. ఆంధ్రభాషలోను, ఆంగ్ల భాషలోను అద్వితీయ రచనలు చేసిన మో తనకు ఆ రెండు బాషలూ రావంటాడు. ఊరికినే భావాన్ని శబ్దానికి అల్లుతుంటాను అంటాడు తుంటరిగా. 'చితి-చింత' (1969) లో నీడల గోడవేమిటని గగ్గోలు పెట్టినా, 'రహస్తంత్రి' (1991)లో పాఠకుల్ని అయోమయంలో ముంచేసినా 'బతికిన క్షణాలు' నుండి పాఠకులు ఆయన కవిత్వం కోసం ఆసక్తిగా ఎదురు చూసారు. 'మో' తన కవిత్వంలో ప్రాపంచిక సుఖదు:ఖాలను గానం చేసాడు. తెలుగు ప్రజల హృదయాలను తడిమాడు. ప్రపంచ సాహిత్యాన్ని పుక్కిట పట్టాడు.

'చితి-చింత' తురువాత తెలుగు సాహిత్యలోకం ఆయన కవిత్వానికి రకరకాల అపాదనలు చేసింది. స్తబ్దత, నిర్వేదం, నైరాశ్యం, లుప్తమైన సాంఘీక చేతన మొదలైనవి ఆయన కవిత్వంలో కనిపించేవన్నారు. దానికి 'మో' కవులు అమాయకత్వపు గీతాలని, అనుభవగీతాలని రెండు రకాలుగా రాస్తారని, తనది అనుభవవాద కవిత్వమని చెప్పాడు. మో కవిత్వంలో ఎప్పుడూ నేపథ్య విషాద సంగీతం మోగుతూనే ఉంటుంది. అనుభూతులను అరమరికలు లేకుండా వ్యక్తీకరిస్తాడు. విలువలు లేని ప్రపంచాన్ని ఈసడిస్తాడు. 'మో' రచనల్లో మర్మకవిత్వం కొంత అర్ధం కాకుండా ఉంటుంది. అధోజ్ఞాపికలు, అర్ధాలు ఇవ్వక పోతే ఓపట్టాన అతని కవిత్వం అర్ధంకాదు. అయితే అర్ధమయ్యేవన్నీ ఆనందంగా ఉండదు. ఆనందాన్ని కలిగించేవన్నీ అర్ధమవ్వాలని లేదు. అందుకే ఆయన కవిత్వం అద్భుతమైనది. అనుభవైక్యవేద్యమైనది. మనసులోతులను స్పృశించగలిగేది. ఉద్వేగపు సరిహద్దులను విస్తరించగలిగేది.

'మో' కవిత్వశైలి గురించి ఆయన మాటల్లోనే "నా కవిత్వశైలి రసవాద శైలి Hermitic, వ్యక్తీకరణవినిర్మాణ విధానం Deconstructionstic, నాభావావేశం అన్వేషణాత్మకం Search Warrant, నా అంతరంగం అస్తిత్వ వాదాత్మకం Existential, నా నిర్వచనం కవిత్వం భాషయొక్క భాష Metalinguistic నా వాక్య నిర్మాణం ఉక్కిరి బిక్కిరి శ్వాస Syntactical Breathlessness నా కవితా వస్తువు ఏక ఘూత రేఖకాదు Not linear.

నా పదబంధాలలో పదాలస్థానాభానం (Dispalcement) ఉంటుంది. దీనివల్ల ఎదురుచూడని (Un expected) అలవాటు కాని (Non descript) పదాల చేలక

(Collocation) ల వల్ల ఆశ్చర్యం కలుగుతుంది. కానీ ఒకానొక చేతనా చేతన (Sub Conscious) స్ఫురిస్తుంది. కానీ పూర్తి భావ వినిమయం (Communication) జరుగదు.

తన రచనలో సంక్లిష్టత ఉటుంది అని అంటూనే దాన్ని సమర్థించుకుంటాడు. అస్పష్టత వేరు సంక్లిష్టత వేరు నా రచనల్లో సంక్లిష్టత మాత్రమే ఉంటుందంటాడు. అంతేగాక పూర్తిగా అన్నీ విప్పిచెప్పే అమాయకత్వం నాకెప్పుడు లేదు అని కుండబ్రద్దలు కొట్టినట్లు చెబుతాడు.

అసలు భావాన్ని ఏ భాషలో నైనా పూర్తిగా విప్పి చెప్పగలమా అనే అనుమానం నాకెప్పుడూ ఉంటుంది అనే సత్యాన్ని వెల్లడించాడు. కవిత్వమనేది మెటఫర్ నుండి మెటానమీకి, కన్‌స్ట్రక్షన్ నుంచి డీ కన్‌స్ట్రక్షన్‌కు, సందేహాన్నుంచి సందేశానికి, నిశ్వాసాన్నుండి విశ్వాసానికి, దేహాన్నుండి హృదయానికి ప్రయాణించాలి అన్నది ఆయన విశ్వాసం.

భక్తి భావాన్ని భక్త కవులు, వాగ్గేయ కారులు అనేక రకాలుగా వెల్లడించడం చూసాం కానీ -

దేవుడు ఉరోసుకుంటాడు
నా తప్పులు క్షమించమంటాడు
నా సామిరంగ
దేవుడోడికి సంకెళ్ళు వేసి
నడిబజార్లో నేనుగానీ లాకెళ్ళుతుంటే
ఆకాశం పక్కున నవ్వుతుంది

అనే ఇలాంటి తెగింపుని మాత్రం చూసుండం. అలాగే 'మో' తన "వీడ్కోలు గీతం" లో

'వెళ్తోన్నానని మీరు
మరీ అంత రోదించవద్దు
పీడా ఒదిలిపోయిందని
కాసింత నిదానం పొందండి'

అంటూ తన నిష్క్రమణపై తానే చమత్కారబాణం విసురుకున్నాడు.

కవిగా మీరు సక్సెసా? ఫెయిల్యూరా? అని అతన్ని ప్రశ్నించినప్పుడు 'మో' ఇచ్చిన సమాధానం అతని మాటల్లోనే "వాస్తవాన్ని, ఆదర్శాన్ని సాహిత్య రూపంలో సమ్మిశ్రమం చేయలేకపోవడం నా వైఫల్యం. కవిత్వంలో వాడే పదాలు వట్టి పెదవుల నుంచి కాక హృదయంలో నుంచి దూసుకురావాలి. మనం వాడే పదాలు, పద చిత్రాలన్నీ కంటిముందు రూపుకట్టాలి. నా పదావళి అంతా వైయక్తికం, మానసికం చదువరితనంలో నుంచి వచ్చినవి. అందుచేత నేను చెప్పిన రెండు అంచులు ముడి పడలేదు. పాఠకులను రీచ్ కాలేకపోయాను "అంటూ అసంతృప్తిని వ్యక్తం చేసాడు" కానీ వయస్సు, అనుభవం పెరిగే కొద్దీ 'మో' కవిత్వంలోని క్లిష్టత సరళంగాను, గాఢాను భూతులు నిర్దిష్ట అంశాలు గా (తత్వాలుగా) మార్పును పొందాయి.

పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు సమీపంలో వట్లూరు గ్రామంలో 1942 జనవరి '5' న జన్మించిన 'మో' గుంటూరు కళాశాలలో ఎం.ఎ. ఆంగ్ల సాహిత్యం చేసాడు. 1960లో 'భారతి' పత్రికలో ఆయన మొదటి కవిత అచ్చయ్యింది. అలా మొదలైన ఆయన కవితా ప్రస్థానం

చితి చింత, బతికిన క్షణాలు, సాంధ్యభాష, కరచాలనం, రహస్తంత్రి, నీడలు జాడలు, వెన్నెల నీడలు, పునరపి, విషాదం, కృష్ణబిలం, మొలసూత్రం, ప్రతీక, ఓంకారాదికం, ఊదాదీపం అంటూ సాగిపోయింది. సాహిత్య అకాడమీ వారికి అనేక అనువాదాలు చేసిపెట్టాడు. 'అజంతా' గారి 'స్వప్నలిపి'ని ఆగ్లంలోకి అనువదించాడు.

ఆధునిక తెలుగు కవిత్వంలో అరుదైన కవితలను తూర్పారబట్టి 'డిస్‌టెన్స్ టైమ్' పేరిట ఆంగ్లంలోకి సమగ్రంగా అనువదించాడు. 'స్వరాజ్యం' నవలను అనువదించారు. అది ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ ప్రచురణకు నోచుకుంది.

ద్రావిడ విశ్వవిద్యాలయంలో ద్రావిడ భాషలను ఒక భాషనుండి మరోక భాషకి అనువర్తింపజేసే బాధ్యతలు స్వీకరించారు. కందుకూరి వీరేశలింగం పంతులు, టంగుటూరి ప్రకాశం పంతులు, చిలకమర్తి లక్ష్మీనరసింహం గారి స్వీయ చరిత్రలను ఆంగ్లభాషలోకి, ఇతర ద్రావిడ బాషల్లోకి అనువాదం చేసే బృహత్కార్యం చేపట్టారు. ఒక్క సాహిత్య, భాషాశాస్త్రానికి సంబంధించినవే కాక సంస్కృతి, నాగరికత, జానపద విజ్ఞానం, విమర్శ, చరిత్రలకు సంబంధించిన గ్రంధాలను కూడా అనువాదం చేసే ప్రణాళికను చేపట్టారు. అంతేగాక అన్నమాచార్య, క్షేత్రయ్య, కృష్ణశాస్త్రి కృతులను ఆంగ్లంతోపాటు ఇతర ద్రావిడ భాషల్లోకి అనువదించారు. ఇటువంటి 'మో' మరణం సాహిత్య లోకానికి తీరని లోటు. కానీ ఆయన మాత్రం తన 'వీడ్కోలు గీతం' లో -

"నేనీ రాత్రి రాత్రిలోకి వెళిపోతాను. కొంచెం దిగులుగానే ఉందనుకో. అంతమాత్రానా ఈ దునియా ఏమీ మునిగిపోదు అంటూ ఆంధ్ర పాఠకులకు వీడ్కోలు చెప్పి వెళ్లిపోయాడు.

<u>ఉపయుక్త గ్రంధాలు :</u>

1. "వెన్నెల నీడలు" – వేగుంట మోహనప్రసాద్
2. "తనికెళ్ళ భరణి అవార్డు స్వీకరణ ప్రసంగ పాఠం" – మో
(ఆంధ్రజ్యోతి దినపత్రిక ది.8-8-2011)
3. "మో" ప్రత్యేక వ్యాసం – ఆంధ్రజ్యోతి ఆదివారం ప్రత్యేక సంచిక ది.14-8-2011
4. "ఒంటరి ద్వీపం – మో" – వ్యాస రచయిత రఘు ఏలూరి